# ఆంతర్యాలు

ఆ సెకండుక్లాసు (అంటే పూర్వపు ఇంటరు క్లాసు) పెట్టెలో తగుమాత్రముగా జనం ఉన్నప్పటికీ శర్మగారికి రెండు వైపులా చెరొకరు యిద్దరూ కూచోదగినంత స్థలం మిగిలేవుంది. కాబట్టి మాంఛి తాపీగా కూచున్నారు ఆయన. సన్నగోరంచు ముతక పంచ, ఖద్దరుగా చలామణీ అయ్యే నేత గుడ్డతో కుట్టిన లాల్చీ వేసుకుని, ఒక అపరాధ పరిశోధకనవల చదువుతూ కూచున్నారు. పైన ఉత్తరీయం వేసుకోవటం హైందవ సంప్రదాయమేగాని తనవృత్తికి ఆటంకం అవుతుందనే నమ్మకంతో ఆయన ఆదినించీ దానిని విసర్జించాడు. తీర్చిదిద్దిన విభూతిరేఖలు, వాటిమధ్య పూర్వపు అర్థణా కాసుకి ఇంచుమించుగా గంధాక్షతలు ఆయన సదాచారసంపన్నతకు ప్రత్యక్ష తార్కాణాలు. ఏదో భుక్తికోసం ఈ వృత్తిని స్వీకరించటంవల్ల లౌకికంగా ఉంటున్నారుగాని, లేకపోయినట్లయితే తప్పకుండా వారు మున్యాశ్రమాల్లోనే ఆధ్యాత్మిక చింతనలో కాలం గడిపే వారని ఆయన్ను చూసినవారందరికీ అనిపించక మానదు.

ఎందుకైనా ముందు జాగ్రత్త మంచిదనే అభిప్రాయంతో ఆయన కిటికీలకు దగ్గరగానున్న ఒల్లమీద కాక మధ్యనున్న బల్లమీదే కూచున్నారు. దీనినిగురించి ఆయన ఒక అరగంటవరకూ చెప్పగలరు—వినేవారికి ఓపిక అంటూ ఉంటే... రైల్లో కిటికీల దగ్గర కూచుని ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైనవాళ్ల వివరాలు లేదంటే ఒక వందమందిని గురించిన భోగట్టా ఆయనదగ్గర ఉంది. ఐతే ఇప్పుడు అవన్నీ చెప్పే స్థితిలో లేరు ఆయన. తన చేతిలోని పుస్తకంలో కథ మాంఛి పట్టులో నడుస్తూండడం చేత ఆయన అందులో లీనమయిపోయాడు. ఒకసారి కనుబొమలు ముడివేసి చాలా తీవ్రమయిన సమస్యలను గురించి ఆలోచిస్తున్నట్టుగా ఉంటారు. అంతలో ఆ చిక్కు కాస్తా విడిపోయినట్టుగా తృప్తిగా గాలి పీలుస్తారు. మరొకసారి—కథలో చక్కటి సన్నివేశం ఏదైనా తగిలికాబోలు - బాగా సర్దుకుని కూచుంటారు. ఇలాగ ఆయన అందులో మునిగిపోయి తన చుట్టుప్రక్కల ఏం జరుగుతున్నదీ తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు.

అంతవరకూ అంత ఏకాగ్రతతో చదువుతున్న శర్మగారు అప్పుడు కిటికీలోంచి లోపలికి వీచిన చలిగాలిని లెక్కచెయ్యక తప్పింది కాదు. దాంతో అప్రయత్నంగా ఆయన చెయ్యి జేబులో వున్న సిగరెట్టుకేసుమీదికి పోయింది. పెట్టె తెరచి నాజూకుగా ఒక్క సిగరెట్టు తీసి పెదిమలకు తగిలించి, దానిని అంటించి వెంటనే తీసివేశారు. ఆ సిగరెట్టును కుడిచేతి మాపుడివేలుకి, మధ్యవేలుకి మధ్యగా నుంచి, పిడికిలి బిగించి, చూపుడు వేలుకి, బొటనవేలుకి మధ్య నేర్పడ్డ ఖాళీ స్థలాన్ని మూతికి దగ్గరగా జేర్చి, రైలు పెట్టె కప్పుకేసి చూస్తూ ఒక్క దమ్ము లాగారు. ఆ పొగని మాత్రం సుమారు అరనిమిషందాకా బయిటికి వదలకుండా "పొగంతా ఏమయిందో చెప్పుకోండి చూద్దాం!" అన్నట్టు నలుగురి ముఖాల్లోకి చూశారు. అయితే ఎవరూ ఆయనను చూడకపోవటంచేత నిరుత్సాహపడ్డారు. కాని అల్లంతదూరాన తల్లికొంగు పట్టుకుని మారాంచేస్తున్న పసివాడొకడు తనకేసి పరకాయించి చూడటం గమనించి, వాడి ముఖంకేసి చూస్తూ ఆ పొగని వదిలారు. సంభ్రమాశ్చర్యాలతో "భలే! భలే!" అంటూ చప్పట్లు చరిచాడు వాడు తను చేసిన ఘనకార్యాన్ని చూసి మెచ్చుకున్నవాడొకడైనా ఉన్నందుకు యెంతో సంతోషించారు ఆయన. ఇట్లాగ సిగరెట్టు కాల్చటంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తన శక్తిసామర్థ్యాలకి తానే మురిసిపోతున్నారు. సిగరెట్టు అంతా పూర్తి అయ్యేవరకు దాని తాలూకు మసిని దానినుండి ఆయన వేరు చేయలేదు మధ్య మధ్య నాలుగైదు సార్లు 'ఆ మసిని దులిపివెయ్యటానికా' అన్నట్టు కుడిచేతి వేళ్లతో అతి నాజూకుగా చిటికెలు వేశారు. కాని ఆ అగురుకు నుసి సిగరెట్టునుండి వేరుకాకుండా జాగ్రత్తపడ్డారు. అందుచేత కాలిపోయిన సిగరెట్టునుసే ఐనా కాని ఆకారంలోమాత్రం సిగరెట్టులాగే ఉండి, కాలవలసిన సిగరెట్టుభాగం, కాలిన సిగరెట్టుభాగం కలిపితే సరిగా సిగరెట్టు అంత పొడవూ ఉండిపోయింది చివరిదాకా. అది పూర్తయ్యేసరికి ఆయనలో అంతకుముందుకంటె ఎక్కువ ఉత్సాహం వచ్చింది ఆ నూతనోత్సాహంలో ఆయన పుస్తకం తీసుకుని మళ్ళా చదవటం మొదలుపెట్టారు.

చదువుతూ చదువుతూ అలవాటుచొప్పున ఎడమచేతి మునివేళ్లతో మీసాలని సవరించారు. ఆపని ఆయన చేసేసరికి దగ్గరలో నవ్వులు, గుసగుసలు వినిపించాయి. ఏమిటో అని అటుకేసి చూశారు. కొందరు కుర్రాళ్లు తనకేసే చూసి నవ్వుతున్నారు. మొదట్లో కారణం స్పష్టంగా తెలియలేదు. కాని అంతలో చటుక్కున స్ఫురణకొచ్చింది. వాళ్ళు తన మీసాలనిచూసి నవ్వుతున్నట్టుగా తోచింది. వెంటనే మరుగుదొడ్లోకి వెళ్ళి అద్దంలో చూసుకున్నారు తన అనుమానమే నిజమయింది. మునివేళ్ళతో మీసాలని సవరించుకున్నప్పుడు వాటిలోని తెల్లని వెంట్రుకలు బయటపడ్డాయి అది చూసే వాళ్ళు నవ్వారు. అసలు బయలుదేరేటప్పుడే అనుకున్నారు—ఇంటికి జేరేవరకు మీసాలమీద చెయ్యి వెయ్యకూడదని... అయితేనేం - అలవాటుకొద్దీ వెయ్యటమూ, అంతలో శ్వేతకేశాలు బయట పడటమూ, అవి ఆ కొంటె కుర్రవాళ్ళ కంట బడటమూ .. ఇన్ని జరిగాయి ఇంకాకూ ఇదంతా ఖర్మ... కాకపోతే ఏమిటి? ఇంటిదగ్గర బయలుదేరేటప్పుడు ఎంత వెదికినా మీసాలకి వేసుకు నేరంగు కనిపించలేదు. అంతకు ముందునాడు చంటాడు దాన్తో ఆడుతున్నాడు. అప్పుడు అది వాడి చేతులోంచి తీసి వాడిని ఏడిపించటం ఎందుకులే అని ఉపేక్ష చేశాడు తను తీరా మర్నాడు ఉదయం తను ప్రయాణం కావలసి వచ్చేవేళకి అది కనిపించలేదు ఎక్కడుందో తీరిగ్గా వెతుకుదామంటే వ్యవధిలేదు .. పోనీ కొత్తది కొనుక్కుందామంటే ఇంకా తెల్లవారలేదు...అందువల్ల ఎలాగో సరి

మధిర భానుమూర్తి

పెట్టుకుని పైకి నల్లనివెంట్రుకలే కనిపించే టట్టు జాగ్రత్తగా సర్ది ఎలాగూ సాయంత్రానికి వచ్చెయ్యవచ్చును గదా అని ప్రయాణమయాడు. ఆ బయలుదేరే టప్పుడే తిరిగి ఇంటికి వచ్చేవరకు మీసాలమీద చెయ్యి వెయ్యకూడదని, వచ్చిన తరువాత ఆ రంగు సంపాదించటం తేలికే గనక ఇక ఏ బాధా ఉండదని అనుకున్నాడు. కాని అప్రయత్నంగా ఈ పని జరిగినందుకు ఎంతో నొచ్చుకున్నాడు.

అసలు ఈ రంగు రాయటం అలవాటు చేసుకున్నందుకు తనని తాను ఎంతగానో నిందించుకున్నాడు. అయినా ఇది తనకు తానయి కోరి చేసుకున్న అలవాటుకాదు. ఆ రావు చేశాడు. వాడు అరవైఅయి దేళ్ళకి పైబడ్డ వయసున్నా కాని ముప్ఫయి సంవత్సరాల బాలాకుమారుడిలాగా అగుపించాలని ఆరాటంలో నెరసినజుట్టుకి నల్లరంగు ముడతలుపడ్డ ముఖానికి పైపూతలు...ఇంకా ఎన్నో చేస్తాడు. ఈ తయారీలో సుమారు రెండుగంటలేనా గడుపుతాడు ప్రతిరోజూ. వాడిని చూడటానికి తను ఒకసారి వెళ్తే అక్కడ వాడు పట్టించాడు, తన మీసాలకి ఈ రంగు. తన మీసాలకి ఆ రంగు వేస్తే మంచి అందం వస్తుందంటూ తన అంగీకారాన్నైనా తెలుసుకోకుండా వాడే పూసి వేశాడు. అద్దంలో చూసుకుంటే తనకి కూడా బాగానే ఉన్నట్టనిపించింది. ఇంతలో ఎరుకున్న వాళ్ళు నలుగురైదుగురు అక్కడికి వచ్చారు. వస్తూనే వారంతా తన మీసాలకేసి పరకాయించి చూసి "డాక్టరు గారు ఏదో మందు కనిపెట్టి నట్టున్నారే!...అయినా రావు గారంత ముసలి వారు కాదు గనక మీకు మందు పట్టిచ్చింది కాబోలు!...ఆలోచన లెక్కువ గనక తల మీది జుట్టు నల్లబడ దనుకుంటా...కాని ఇక రావుగారికి మాత్రం ఈ రంగు తప్పదు..." అన్నారు. వారు తనని వేళాకోళం చేస్తున్నారో, నిజంగా అంటున్నారో తెలియలేదు తనకి. కాని రావుని ప్రత్యక్షంగా వేళాకోళం చెయ్యటం చేత తనని నిజంగా మెచ్చుకుంటున్నారని విశ్వసించవలసి వచ్చింది. వారి బారినుండి తప్పించుకుందుకు లేక "ఏదో!...పని చేసిందండి..." అంటూ అస్పష్టంగా నీళ్లు నమిలాడు తను.

ఆక్షణంనుంచి అనుకోని కొత్త సమస్య ఎదురయింది. వారంతా నిత్యం తన దగ్గిరకి వైద్యానికి వచ్చే వారే! ఇవాళ తనమీసాల నలుపుని ఇంతగా మెచ్చుకుని రేపు వాటి స్థానే తెల్లమీసాలు చూస్తే ఇంకే మయినా ఉందా? తన గుట్టు కాస్తా బయటపడి పోదూ?...అందుచేత వారికి ఎప్పుడూ అలాగే కనిపించేందుకని ఇక ఆరంగు వెయ్యాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే ఆ రంగుకొని ప్రతిరోజూ ఉదయం మీసాలకి రంగు వెయ్యనిదే ప్రపంచానికి అగుపించేవాడు కాదు.

సుమారు ఒక నెల దాటాక తెలిసింది— ఆనాడు వారంతా తాను రంగు వేసినట్టు పసికట్టారని. కాని ఇప్పుడు వ్యవహారం చెయ్యిదాటిపోయింది. ఊళ్ళో చాలా మంది చూశారు. ఇప్పుడు తను తెల్లజుట్టు, నల్ల మీసాలుగల ఆసామీగా పేరు పొందాడు. అందుచేత దానిని మార్చేందుకు వీలులేదు. ఇక చెయ్యదగ్గదల్లా పొరపాటునైనా ఒక్క నెరసినవెంట్రుకయినా తొంగి చూడకుండా తను మాత్రం కట్టుదిట్టంగా రంగువెయ్యటమే. ఆపని ఆనాటినుంచి చాలా శ్రద్ధగా చేస్తున్నాడు. అయితే నేం? ఇవాళ తన దురదృష్టంవల్ల ఆ రంగు పోవటం, ఎంత జాగ్రత్త తీసుకున్నా ఆ రహస్యం బయట పడటం, అందులో అల్లరి కుర్రకారు కంట పడటం జరిగింది.

మరొక రెండు స్టేషన్లు దాటాక ఆ కుర్ర వాళ్ళంతా దిగిపోయారు. అప్పటికి ఆయన


కొద్ది మందికే తెలుసును



హంగేరి దేశపు వర్తైడూరి పెండ్లి కూతుళ్లు పర్యయుగపునాటి దుస్తులైన కుప్పం తంపాగ, ఎంబ్రాయిడరీ చేసిన దుమాల్లు మొదలైనవి ధరింతురు. ఈ దుమాల్లు దిన్నర్ తయారింత యుందును. ఒక్కొక్కప్పుడు వీటిని తయారుచేయుటకు ఏండ్లు పట్టును. పెండ్లి కొడుకు ధరించు నగిషీ లాటకు తెల్ల అంగీ, పూవు లమర్చిన టోపీ శావగర్వితముగ నుండును.

ప్రఖ్యాత బ్రాండు

తుషార్

వనస్పతి




ప్రతి ఔన్సుకు 700 ఇంటర్నేషనల్ యూనిట్ల విటమిన్ 'ఏ' మరియు 'డి' చేర్చబడిన

తుషార్ ప్రఖ్యాత బ్రాండు వనస్పతి. ఆరోగ్య ప్రదమగు రీతిని తయారు చేయబడి, పుష్టి, ఆరోగ్యము నొసగుటచే తుషార్‌ను సాటిలేని వంట పదార్థముగా నెంచుచున్నారు.

తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్.
కర్నూలు (ద. ఇండియా)

# ★ అంతర్యాలు ★

మనస్సు కుదుటపడింది. వాళ్ళు కంటికి కని పించటంలేదు కనక ఇదివరకటంత కోపం లేదు గాని మొత్తానికి వారి మీద ఆయనకు కోపం తగ్గలేదు. ఇవాళ తనని చూసి వారు నవ్వారు గాని, వాళ్ళకి మాత్రం వయస్సు వచ్చేసరికి ఇవన్నీ రావా?...మన చేతుల్లో ఏమున్నా ఉంది గనక నా—కొవాలనుకున్న ప్పుడు రావటానికి, వద్దనుకుంటే పోవటా నికి. యిప్పుడిలా నవ్వగానే సరా?...రేపు వాళ్ళని చూసి ఆ కాలపు చిన్న పిల్లలు ఇల్లాగ నవ్వరూ?...అప్పుడు తెలుస్తుంది వాళ్ళకి తన బాధ...ఇప్పుడంటే అరవై పైబడబట్టి తను ఇలాగున్నాడు కాని వయస్సులో ఉన్నప్పుడు తనూ అందంగానే ఉండేవాడు. తనని అమ్మమ్మ అస్తమానం అనేది కూడాను "మన్మథనామ సంవత్స రంలో పుట్టినందుకు రూపమన్మథుడివిరా నాయనా!..." అంటూ. ఆ మాటవల్లే తనకి ఇప్పటికీ అరవై ఏళ్లని బాగా గుర్తు.

ఇలా ఆలోచించినకొద్దీ అర్థం లేకుండా ఆలోచించడమే అవుతుంది గాని ప్రయోజన మేమీ ఉండబోదని తెలుసుకున్న వారై ఆయన తిరిగి పుస్తకం చదవటంలో మునిగి పోయారు. ఉత్సాహంకోసం మరొక్క సిగరెట్టు ముట్టించి ముచ్చటగా పొగని నాసికా రంధ్రాలగుండా వదుల్తూ.

అప్పటికప్పుడే సూర్యుడు అస్తమించ టానికని తొందరపడటం, ఆయన కూచున్న చోటికి చదవటానికి కావలసినంత వెలుతురు లేకపోవటం, ఇంకా రైల్లో దీపాలు వెలి గించాలన్నంత జ్ఞానం స్విచ్చికి దగ్గరగా కూచున్న ప్రయాణీకుడొక్కడికీ లేక పోవటం, తన కంటినున్న సులోచనాలకి (చిన్న చిన్న పెద్ద భూతద్దాలతో తయా రైన జోడు అది) చేతిలో వున్న పుస్తకానికి మధ్యగా వలయాలు తిరుగుతూ ప్రయాణి స్తున్న సిగరెట్టుపొగ అడ్డురావటం వల్ల అక్ష రాలు అస్పష్టంగా కూడా కనపడక, ఆయ నకు కోపం ఎక్కువయి, చటుక్కున లేచి నుంచుని, చెప్పులు తొడుక్కుని, గంభీ రంగా నాలుగడుగులు స్విచ్చిబోర్డు దగ్గరికి వేసి లైటు వెయ్యబోయి ఫాను వేసి "అబ్బ! ఉన్న చలిచాలక ఇదొకటా మహాను భావా?..." అని నలుగురిచేతా అనిపించు కుని, వెంటనే ఫాను ఆపి, తనకు అవసర మున్నా లేకపోయినా అన్ని లైట్లు వెలి గించి వచ్చి కూచున్నారు.

ఇంతలో మరొక స్టేషను వచ్చింది. రైలు ఆగింది. జనం హడావుడిగా ప్లాటుఫారం అంతా కలియ తిరుగుతున్నారు. కొందరు తమ పెట్టెలోకి ఎక్కబోయి "అరె! ఇది పరువుల పెట్టెరా!..." అంటూ దిగిపోతు న్నారు. ఎక్కేవాళ్ళకి ఎక్కాలని తొందర. దిగేవాళ్ళకి దిగాలని తొందర. మొత్తానికి జనం చాలా మందే ఎక్కుతూ ఉన్నారు. ఇందరినీ తప్పించుకుని ఒక నలభై ఏళ్లవ్యక్తి ఒక రోగిష్టి మనిషిని పెట్టెలోకి ఎక్కించి నలుగురినీ బ్రతిమాలి ఒక బెంచీ ఖాళీ చేయించి దానిమీద ఆ రోగిని పడుకో బెట్టాడు. ఆ రోగికి చోటు ఇచ్చిన వారికి కృతజ్ఞత తెలియపరుచుకుంటూ తను మాత్రం నిలబడే ఉన్నాడు.

"పాపం ఇలా ఎంతదూరం తీసుకెడ తారు?—చాలా బాధపడుతున్నట్టున్నారు. ఏం బాధో గాని?..." అంటూన్న ఆ రోగి తాలూకు విన్న ప్రయాణీకుడు సానుభూతితో అడిగాడు.

"అయ్యో! ప్రక్క స్టేషనేనండి! ... ఆ ఊళ్లో మంచి డాక్టరుగా రున్నారని, ఆయ నకి చూపించటానికి తీసుకు వెడుతున్నాము ...చాలాకాలంనించి బాధపడుతున్నాడండి ..." అన్నాడు కూడా ఉన్నాయన.

ఈ మాటలు వినటంతో చదువుతున్న పుస్తకాన్ని అల్లాగే ఆపుచేసి దృష్టి వారికేసి మరల్చారు ఆశతో శర్మగారు.

"మరి అలాంటప్పుడు ఏ మద్రాసో, విశాఖపట్నమో తీసుకు వెళ్ళక పోయారా —ఈ చిన్న చిన్న డాక్టర్లకి చూపించే కన్న?..." అని అడిగాడు ప్రయాణీకుడు.

ఆ నిరసన, తృణీకారం తనే చేస్తున్న ట్టుగా నొచ్చుకున్నారు శర్మగారు. పైకి మాత్రం ఏమీ అనలేదు.

"ఆఁ!...అవ్వీ అయాయండి ... వాళ్ళ వల్ల కాలేదు...అదృష్టం అంటూ ఉంటే ఇక్కడే బాగుపడాలి..." అన్నాడు రోగికి ఆసరాగా వచ్చిన మనిషి.

తన ఊరికే ఆ రోగిని తీసుకు వస్తున్నారని, ఆశలన్నీ ఆ ఊరు మీదే ఉన్నాయని, మద్రాసు, విశాఖపట్టణంలో కూడా వ్యాధి కుదరలేదని విన్నాక శర్మగారి మనస్సు కుదుట పడింది. అయితే వారు ఏ డాక్టరుకి చూపించదల్చుకున్నారో తెలియక తికమక పడుతున్నారాయన.

"అందరూ చెప్పారండి....ఈ వ్యాధి శాస్త్రిగారు తప్పకుండా కుదర్చగలరని... ఇదివరలో కూడా నాలుగైదు కేసులు ఇలాంటివి ఆయన కుదిర్చారట... మీ ఊరికి దగ్గరగా ఉన్న శాస్త్రిని వదులుకుని ఇంత దూరం ఎందుకువచ్చావనివన్నుమద్రాసులో అడిగారు కూడాను... ఈయనకు అంత పేరుంది...ఏమో!... మావాడి అదృష్టం బాగుంటే ఆయన చేతులో వీడికి కూడా నయమయి పోతుంది..." అన్నాడు ఆయన.

ఈమాటలు విన్న శర్మగారికి మతిపోయి నంత పనయింది. ఇంతవరకూ ఎన్నో ఊహా సౌధాలు నిర్మించుకుంటున్నారు; దక్కని కేసు దొరుకుతోందని. అంతలో పిడుగు లాంటి మాట చెవినిపడింది...ఇంతకూ వీళ్ళు వెడుతున్నది శాస్త్రిదగ్గరకని తెలుసుకుని ఆయన నిశ్చేష్టులయి పోయారు. శాస్త్రి నిన్న కాక మొన్న వచ్చి ప్రాక్టీసు పెట్టాడు. అతనివయస్సు అంతా పోగుచేస్తే తన సర్వీ సంత లేదు. పోనీ విద్యా విషయికంగా ఏమన్నా ఘనుడా అంటే కాదు. ఇద్దరికీ ఒకటే డిగ్రీ, ఆమాటకివస్తే తన డిగ్రీ పూర్వపుది గనక శాస్త్రి డిగ్రీకన్న ఎక్కువ విలువైనది. పైగా వయస్సుచేత, అనుభవంచేత తనకు తెలిసిన విషయాలు ఎక్కువ. తనకు


మీ బిడ్డ...

1, 3 సంవత్సరముల మధ్య, శాకాహారులైన మగ బిడ్డలలో, లివర్ వ్యాధులు సామాన్యమని, మా లెక్కలవల్ల తేలుచున్నది.

తరుచుగ అజీర్ణ వ్యాధులు, కడుపు ఉబ్బ రము, చికాకు పడుట, కోపము, ఆకలి మందగించుట మొదలైన గుణ ములు లివర్ వ్యాధిని సూచించు లక్షణములు.

జమ్మి'స్

లివర్ క్యూర్




రక్తం లివర్ & ప్లీహ వ్యాధులకు

జమ్మి వెంకటరమణయ్య & సన్స్
జమ్మి బిల్డింగ్స్, మైలాపూర్, మద్రాసు-4.

ఉన్నంత కట్టుదిట్టమయిన. శాస్త్రజ్ఞానం శాస్త్రికి లేదని తనకి నమ్మకంగా తెలుసు. ఏదో కొత్త మోజుమీద కొట్టుకుపోతు న్నాడుగాని లేకపోతే నిజానికి తనకి, అత నికి పోటా?...

తను ఆఊళ్ళో ప్రాక్టీసుపెట్టి నలభై సం వత్సరాలు కావస్తోంది. ఇన్ని ఏళ్ళనించీ అచుట్టు పక్కలకి తను ఒక్కడే నాటు-వైద్యుడు! ప్రజలందరికీ తలలో నాలుకగా ఉంటూ, వారందరి కష్టసుఖాలు తనవిగా తలపోస్తూ, వారికి వైద్యంచేస్తూ, ఇచ్చారనకుండా, ఇవ్వలేదనకుండా ఏదో గొప్పగా కాలక్షేపం చేసుకుంటూ వచ్చాడు తను.

అసలు తను ఆఊరు వచ్చేనాటికి కేవలం సంచికట్టు వైద్యులు ఒకరిద్దరు తప్పిస్తే, వైద్యవిద్య నభ్యసించి, సర్కారు పరీక్షనిచ్చివచ్చిన వారెవరూ లేరు. ఒకవేళ ఎవరేనా ఉన్నావారు నాటువైద్యం తాలూకు పరీక్షలేవైనా అయారేమో కాని, తనలాగ ఇంగ్లీషువైద్యం తెలిసినవారు కాదు. అందువల్లనే తను ఆ ఊరు వచ్చి ప్రాక్టీసు ప్రారంభించిన కొద్దిరోజులకే తనకి పెద్దపేరువచ్చింది. ముఖ్యంగా తను చేసే వైద్యంపట్లకన్న తనవద్దనున్న పరికరాలపట్ల వారికి ఆసక్తి ఎక్కువగా ఉండేది. వారెవరూ వాటిని ఇదివరలో చూడలేదు. అందువల్ల ఎంతో శ్రద్ధగా వాటిని పరికిస్తూ తను ఏమందు ఇస్తే అది త్రాగి ఎంత ఖరీదంటే అంతా ఇచ్చేవారు. అటువంటి అంతేరీ రోజులు అవి...

తన వైద్యంవల్ల, నోటి మంచివల్ల, క్రమంగా ఏదో కొంత స్థిరం, చరం సంపాదించుకోగలిగాడు తను...వాళ్ళకి కూడా తనంటే అలాంటి విశ్వాసం ఉండేది... ఈ విధంగా తను ఒక పాతిక సంవత్సరాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యం వెలిగించాడు. అంటే ఇక ఎవరూ వైద్యులు లేరని కాదు. ఉన్నవాళ్లు చెప్పుకోదగినంతగా తనకి అడ్డురాలేదు. అలా ఉంటూండగా ఇంకా ఇద్దరు ముగ్గురు డిగ్రీలు పుచ్చుకునివచ్చారు. వారు రావటంతో తనకి కొంచెం నష్టంకలిగినమాట నిజమే!...కారణం—ఆ ఊరి జనాభా అలాగే ఉన్నారు...వారి రోగాల సంఖ్యయినా చెప్పుకోదగినంతగా పెరగలేదు...ఎటొచ్చీ పెరిగినదల్లా వైద్యుల సంఖ్యే అందువల్ల ఉన్నవాటిని అందరూ పంచుకోవలసివచ్చేసరికి ఒక్కొక్కరి వాటాకు వచ్చేది తగ్గిపోయింది.

ఇల్లాగ కొన్ని సంవత్సరాలు గడిచాయి. తనకి వయస్సు మీరిపోతోంది. ఇదివరకటంత శక్తి - ఎంత తెచ్చిపెట్టుకుందామనుకున్నా-ఉండటం లేదు...అందుచేతనే తనుకూడా అంతబాధ పడటంలేదు. అలాగే రోజులు గడిచిపోతే అంత బాధగా ఉండక పోను...కాని అలా జరగలేదు...ఎక్కడ నుంచో ఉప్పెనలాగ వచ్చి ఈ ఊళ్ళో ప్రాక్టీసు పెట్టాడు శాస్త్రి. అంతే!... అందరి అదృష్టాలు తల్లక్రిందులయాయి. ఇప్పుడు ఊరిలో రోగిష్టివాళ్ళు శాస్త్రి దగ్గరే వైద్యం. అతని హస్తవాసి మంచిదట...అతని చేత్తో మట్టి నలిపి ఇచ్చినా, మంచి నీళ్ళిచ్చినా - అదే మహా విలువైన ఔషధమై ఎలాంటి రోగాన్నయినా క్షణంలో రూపు మాపు తుందట. అసలు అతనికున్న తెలివి ఇంకెవరికీ లేదట...పెద్ద పెద్ద వాళ్లు చెయ్యలేని ఆపరేషన్లుకూడా సునాయాసంగా చేసేస్తాడట...అతను ఆ విధంగా ఎందరికో నయం చేశాడట!...ఈ విధంగా అతన్నిగురించిన వార్తలు విశేషంగా ప్రచారంలోకి వచ్చేకొయి జనం దూర భారాలకయినా ఓర్చి అతని దగ్గరకి తండోప తండాలుగా వచ్చి పడుతున్నారు...

ఇప్పుడతను పోటేటంత పెట్టుబడి పెట్టాడు...అతనికింద చాలామంది పనిచేస్తున్నారు. రోజు రోజుకీ పేరు పెరుగుతోందేగాని తగ్గటంలేదు...ఇంత కూడా వుడిలో ఇంత తనని- అందులోనూ వయస్సు మీరిన వాడిని ఎవరు చూస్తారు?...అయితే దానికి తను విచారించటం మానుకున్నాడు.. 'భగవంతుడు తనకి ఎంత రాసిపెట్టాడో అంతవరకూ సంపాదించుకున్నాడు... ఇప్పుడు తను పనిచెయ్యకుండా ఇంటిదగ్గర కూచున్నాగాని నిశ్చింతగా రోజులు వెళ్ళిపోతాయి. తన పిల్లలుకూడా చదువుకుని, వాళ్ళంతటి వాళ్ళు అయేవరకూ కావలసిన ఆర్థిక స్తోమతుకూడా ఉంది. ఆశకి అంతేమిటి?...పైగా పాతనీరుపోయి క్రొత్త నీటికి చోటు ఇవ్వవద్దా?' అని మనస్సుకి సరిపెట్టుకుని ప్రాక్టీసుకూడా మానుకున్నాడు తను.

ఎలాగూ ప్రాక్టీసు కట్టిపెట్టాలి గనక అప్పుడు అలాగ మనస్సుని సమాధాన పరుచుకున్నాడు గాని, శాస్త్రిరాకే తనుప్రాక్టీసు మానెయ్యటానికి కారణం అని తన మనస్సులో బాగా నాటుకుపోయి ఉండటంవల్ల హఠాత్తుగా శాస్త్రిపేరు విన్నప్పుడల్లా (తను ప్రాక్టీసు మానివేసి రెండేళ్ళు పైగా అయినాకాని)- ఒకవిధమైన కోపం, అసూయ కలుగుతాయి...పైగా తనకీ, అతనికీ వయస్సులోను అనుభవంలోను ఎంత అంతరంఉందో గుర్తుకువచ్చి ఆ కోపం మరింత అవుతుంది. గుడ్డువచ్చి పిల్లని వెక్కిరించినట్లు ఈ శాస్త్రివచ్చి తనచేత వైద్యవృత్తికి స్వస్తి చెప్పించాడనే ఉక్రోషం ఎక్కువగానే ఉంది...అయితే శాస్త్రి వచ్చి తనతో "అయ్యా!...ఇక మీరు విరమించుకోండి!" అని చెప్పలేదు. అతను వచ్చాక ఏర్పడ్డ పరిస్థితుల ప్రభావంవల్ల తను ఆపని చేశాడు...దీనికి ఎవరి ప్రోద్బలమూ లేదు...తన ఇష్టంమీద చేసినదే...అయినా కాని శాస్త్రిమీద తనకి అక్కసుగానే ఉంది.కనకనే వారెవరో శాస్త్రిదగ్గరకి తీసుకు వెడుతున్నామనేసరికి తనకి అంతబాధ కలిగింది.తనకిఅలాగ అనిపించినదే'కాని నిజానికి ఇవాళ వాళ్లు తన దగ్గరకి తీసుకువస్తే తనవద్ద ప్రస్తుతానికి ఒక్క మందూ లేదు...కనీసం ఒక అనుపత్రయినా లేదు...ఇంటిదగ్గిర రోగిని చూసి,పరీక్ష చేసి తనుకూడా వాళ్ళని శాస్త్రిదగ్గరకే పంపివుండును...ఆపని వారంతట వారే చేసేసరికి మాత్రం కోపంవచ్చింది తనకి...దీనికి అంతకీ కారణం తను సుమారు నలభై యేళ్ళపాటు ఆవృత్తిలో వుండి ఇరవై నాలుగు గంటలూ అదే ధ్యానంలో ఉండటమే!...అంతకంటె మరొక కారణమేమీ కనిపించదు...అన్ని సంవత్సరాలుగా అందులో ఉండటంవల్ల ఏరోగిష్టి వాడు వచ్చినా తన సలహా తీసుకు తీరాలనిపిస్తోంది. రెండేళ్ళనించి ప్రాక్టీసు మానివేసినా...

ఈవిషయం జ్ఞాపకం వచ్చాక తనని చూసి తనే నవ్వుకున్నారు శర్మగారు—శాస్త్రి మీద నిష్కారణంగా తన మనస్సులో కోపపడ్డందుకు...

ఇంతలో స్టేషనులో రైలు ఆగటమూ, అక్కడ దిగవలసిన వారందరూ త్వరగా దిగటమూ జరిగాయి. శర్మగారు తన ఆలోచనలు వదిలి ఎదురుబల్లమీద పడుక్కున్న రోగికేసి చూస్తే ఆరోగి అక్కడ లేడు....ఇంకా చాలా మంది అక్కడనుంచి వెళ్ళిపోయారు. అప్పుడు హడావుడిగా బయటకు చూశారు. తను దిగవలసిన స్టేషను వచ్చిందనిగ్రహించి వెంటనే పుస్తకాన్ని,సంచిని రెండుచేతులా పట్టుకుని క్షణంలో ప్లాటుఫారంమీద పడ్డారు. అక్కడనుంచి తిన్నగా ఇంటికి బయలుదేరారు. ★


శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మదరాసు-30

కేశ మర్దినిని
అకాల నెరుపు ఆపుటకు
కాశ్మీర్ - కుసుమం
మీ ఇష్టమైన నూనెలో నానవేయండి
యునైటెడ్ కేసరల్, బందరు వీధి, మదరాసు-1. విజయవాడ.
[illegible]
సంజీవగుప్త వంధ్యప్రాది
ఇతర 54 ఔషధముల
జాబితా ఉచితము